నమస్తే తెలంగాణ
తెలంగాణ జైత్రయాత్ర 2023
హైదరాబాద్ | గురువారం 2 నవంబర్ 2023 www.ntnews.com

## దటీజ్ తెలంగాణ



దేశంలోని మొత్తం ఐటీ ఉద్యోగాల్లో 44 శాతం వాటా తెలంగాణదే. తొమ్మిదేండ్లలో ఐటీ ఎగుమతులు మూడురెట్లు పెరిగాయి. టాప్-5 గ్లోబల్ టెక్ కంపెనీలు హైదరాబాద్‌లోనే ఉన్నాయి. నెలకు 10 వేల మంది ఐటీ ఉద్యోగులు లొకేషన్ షిఫ్ట్‌కు అప్లై చేస్తున్నారు. మౌలిక వసతులు, లివింగ్ కాస్ట్ అంశాలే కారణంగా చెబుతున్నారు.

**సంక్షేమం**

ప్రభుత్వ దవాఖానల్లో డెలివరీలు చేయించుకున్న గర్భిణులకు పోషకాహారం అందించే కేసీఆర్ కిట్‌లో సుమారు రూ.10వేల విలువైన వస్తువులను సర్కారు ఇస్తున్నది. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 13,90,636 మంది లబ్ధి పొందారు. ఇందుకోసం ఇప్పటి వరకు రూ.1,420 కోట్లు ఖర్చుచేసింది. ఇలాంటి పథకం దేశంలో ఎక్కడా లేదు.

**కేసీఆర్ కిట్**

పథకం ప్రారంభం **2017**

లబ్ధిదారుల సంఖ్య **13,90,636**

## మైనారిటీ సంక్షేమం.. దేశానికే ఆదర్శం

### 2014కు ముందు తెలంగాణలో..

- 12 గురుకులాల సంఖ్య
- 5,760 విద్యార్థుల సంఖ్య
- 258 టీచర్ల సంఖ్య
- 509 కోట్లు 2013-14లో కేటాయించిన నిధులు
- మదర్సాల్లో ఉండే ఇమామ్, మౌజమ్‌లకు ప్రతి నెలా గౌరవ వేతనం లేదు

### 2014 తర్వాత స్వరాష్ట్రంలో

- 192 కొత్త గురుకులాలు
- 97,920 విద్యార్థుల సంఖ్య
- 6,120 టీచర్ల సంఖ్య
- 10 వేల కోట్లు తొమ్మిదేండ్లలో చేసిన ఖర్చు
- మదర్సాల్లో ఉండే ఇమామ్, మౌజమ్‌లకు ప్రతి నెలా గౌరవ వేతనం రూ.10 వేలు


| షాదీ ముబారక్ ద్వారా యువతుల వివాహానికి సాయం | షాదీముబారక్ లబ్ధిదారులు | షాదీముబారక్ పథకానికి సర్కారు చేసిన ఖర్చు |
|---|---|---|
| రూ.1,00,116 | 2,68,230 | రూ.2,258.17 కోట్లు |



- మైనారిటీ కాలేజీల నిర్వహణ ఖర్చు రూ.788.66 కోట్లు
- సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ (20 లక్షలు) పొందినవారి సంఖ్య: 2,210

**కేంద్రం 2023-24లో కేటాయించిన బడ్జెట్ రూ.3,097 కోట్లు**

**ఇతర రాష్ట్రాల్లో.. 2023-24 బడ్జెట్‌లో మైనారిటీ సంక్షేమానికి కేటాయించిన నిధులు**



- రాజస్థాన్: జనాభా 80 లక్షలు — కేటాయింపు రూ.540 కోట్లు
- మహారాష్ట్ర: 1.40 కోట్లు — రూ.674 కోట్లు
- కర్ణాటక: 90 లక్షలు — రూ.2,000 కోట్లు
- ఉత్తర్ ప్రదేశ్: 4 కోట్లు — రూ.1,782 కోట్లు
- తెలంగాణ: 50 లక్షలు — రూ.2,200 కోట్లు

# ఏటు చూసినా.. పచ్చదనమే

## హరితహారంతో ఆకుపచ్చ తెలంగాణ సాక్షాత్కారం

- కోట్లాది మొక్కలకు ప్రాణం పోసిన కేసీఆర్
- సబ్బండ వర్గాలకు సంక్షేమ ఫలాలు
- గిరకబాయి చప్పుడు లేదు.. బిందెల కొట్లాట లేదు
- 'నమస్తే తెలంగాణ'తో పద్మశ్రీ వనజీవి రామయ్య

నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ

'ఇందుగలడందులేడని సందేహము వలదు..' అని శ్రీహరిని సర్వాంతర్యామిగా పేర్కొన్నాడు ప్రహ్లాదుడు. ఇప్పుడు తెలంగాణలో ఎక్కడ చూసినా 'హరిత'లక్ష్మి కనువిందు చేస్తున్నదని చెబుతున్నాడు వనజీవి, పద్మశ్రీ పురస్కార గ్రహీత రామయ్య. ఈ పచ్చదనమంతా ఒక్కరోజులో వచ్చింది కాదు. తెలంగాణ సాధకుడు సీఎం కేసీఆర్ పట్టుదల వల్లే సాధ్యమైందని ఆయన చెబుతున్నారు. హరితహారంతోనే పచ్చదనం పురుడుపోసుకున్నది. ఆకుపచ్చ తెలంగాణ ఆవిష్కృతమైందని అంటున్నారు. పచ్చటి తెలంగాణ ఆవిష్కరణ, సబ్బండ వర్గాలకు సంక్షేమ ఫలాలు, బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనపై తన అభిప్రాయాలను 'నమస్తే తెలంగాణ'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...



### 'గ్రీన్‌బంధు' ఇస్తే బాగుంటుంది..

రైతుబంధు, దళిత బంధు మాదిరిగానే గ్రీన్‌బంధు పథకం తెస్తే బాగుంటుంది. మొక్కలు నాటి చెట్లు పెంచే వాళ్లకు ఈ పథకం ద్వారా పారితోషికం అందిస్తే వనాలు మరింతగా వృద్ధి చెందుతాయి.

గత పాలకులు ఎప్పుడో ఏడాదికోసారో మొక్కలు నాటించేవారు. అందరూ నాటాలని చెప్పి చేతులు దులుపుకొనేవాళ్లు. నాటిన మొక్కల గురించి పట్టించుకునే వాళ్లు కాదు. సీఎం కేసీఆర్ అలా కాదు. హరితహారాన్ని నిరంతర కార్యక్రమంగా మార్చారు. పదేండ్లలోనే పచ్చని తెలంగాణను ఆవిష్కరించారు. చిన్ననాటి నుంచి నేను కన్న కలలన్నీ హరితహారంతో నెరవేరాయి. ఈ జన్మలో ఇలాంటి హరితవనాలను చూస్తానని కలలో కూడా అనుకోలేదు. సీఎం కేసీఆర్ కృషి, పట్టుదలతో ఈ జన్మలోనే చూసే భాగ్యం దక్కింది.

### ప్రజల బాగు కోసం పరితపించే నాయకుడు

మనిషి బతికేందుకు బువ్వ కావాలి. అది పండించే రైతు చల్లగుండాలి. చుట్టూ మొక్కలుండాలి. పురుగూ పుట్రా బతకాలి. అందుకోసం సీఎం కేసీఆర్ అన్ని చర్యలు తీసుకున్నారు. మునుపటిలా గ్రామాల్లో గిరకబాయి చప్పుడు లేదు. బిందెల కొట్లాట లేదు. ముఖ్యంగా ఆడపిల్ల అంటే అందరిలోనూ అదురుపోయింది. వాళ్ల కోసం అనేక పథకాలు ఉన్నాయి మరి. ప్రజల బాగు కోసం పరితపించే గొప్ప నాయకుడు కేసీఆర్. నా దృష్టిలో తెలంగాణకు ఆయన ఓ గొప్ప మెకానిక్, గొప్ప డాక్టర్.

### అయ్యాల ఎక్కడ చూసినా బొగ్గునాల బోడులే..

తెలంగాణ రాకముందు ఎక్కడ చూసినా బొగ్గునాల బోడులే కనపడేవి. రోడ్ల వెంట నీడనిచ్చే చెట్టు ఒక్కటీ ఉండేది కాదు. గండి పడి ఎండిపోయిన చెరువుల్లా భూములుండేవి. మనిషి బతికేందుకు అక్కరకొచ్చే చెట్టూచేమలు పెంచాలన్న ఆలోచనే చేయలేదు గత పాలకులు. సీఎం కేసీఆర్ పుణ్యమాని సాగునీటి ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చాయి. నాటి బీడు భూములే నేడు పచ్చని పంటలనిస్తున్నాయి.


### మొదట బాగు చేసిందే చెరువులను..

స్వరాష్ట్రంలో తెలంగాణ వాతావరణం పూర్తిగా మారిపోయింది. కేసీఆర్ సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ముందుగా చెరువులను బాగు చేయించారు. దీంతో చెరువులకు అనుసంధానంగా ఉన్న అనేక వృత్తులు జీవం పోసుకున్నాయి. హరితహారం పట్ల ప్రజల ఆలోచనా విధానం మారింది. కొన్నిచోట్ల నెలకు మూడు, నాలుగు సార్లు మొక్కలు నాటుతూ మొక్కల పండుగ చేసుకుంటున్నారు. ఏ శుభకార్యం ఉన్నా.. మొక్కలను బహుమతిగా ఇస్తున్నారు. ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ చేస్తున్న గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమం నాకెంతో ఇష్టం. ఊరూరా కండ్ల నిండా పల్లెప్రకృతి వనాలు కనిపిస్తున్నాయి. కోట్లాది మొక్కలు ప్రాణం పోసుకుంటున్నాయి.

-ఖమ్మం రూరల్

## సోషల్ యాంగిల్

### నేటి ముచ్చట



నాడు ఉద్యమ ఊట
నేడు సంక్షేమ బాట
పోరాటం ఆనాటి పథం
ప్రగతి ఈనాటి శకం

నా తెలంగాణ
బడి బాగుపడ్డది
మడి పచ్చవడ్డది
వసంతం మన సొంతం
సంతోషం ఇక ఆసాంతం

- చైతన్య

**పవర్ పంచ్**

"కర్ణాటకలో
ఏ ప్లేసుకైనా,
ఏ టైముకొస్తారో
చెప్పండి.
ఆ టైముకి
అక్కడ
కరెంట్ ఉండేలా
చూడకపోతే చెప్పండి!"

- మోహన్ రుషి



### సకలం.. సంక్షేమం

తండాలు పంచాయతీలైనయ్
ఇంటింటికీ తాగునీళ్లొచ్చినయ్
ఊరంతా సీసీ రోడ్లు పడ్డయ్
పొలమేస్తే రైతుబంధు ఇచ్చే
రోజంతా కరెంట్ వచ్చే
ఉచితంగా చదువు
ఆకలికి అల్పాహారం, భోజనం
ఇంటింటా సంక్షేమం
పల్లెల్లో సంబురం

- శ్రీధర్



## సిగ్నల్ ఫ్రీ ఎల్బీనగర్

ఎల్బీనగర్ చౌరస్తా.. ఒకప్పుడు ఈ ప్రాంతం ట్రాఫిక్ వలయం. సిగ్నల్ దాటాలంటే అదో ప్రహసనం. ఈ బాధలన్నింటికీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. ఇక్కడ అండర్ పాస్, ఫ్లై ఓవర్లు నిర్మించింది. దీంతో ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, విజయవాడ నుంచి వచ్చీపోయే వాహనాలతో పాటు ఇబ్రహీంపట్నం, సికింద్రాబాద్, దిల్‌సుఖ్‌నగర్, వనస్థలిపురం నుంచి రాకపోకలు సులభతరమయ్యాయని స్థానికులు చెబుతున్నారు. నగర ప్రయాణం నరకం గతం. మన రహదారులు ఇప్పుడెంతో ఘనం!

## ఏరియల్ వ్యూ: ఆర్మూర్



సిద్దుల గుట్ట

# రెవెన్యూ డివిజన్‌తో పాలనా సౌలభ్యం

ఆర్మూర్ వ్యవసాయానికి పుట్టినిల్లు. దేశంలోనే ఆదర్శ పల్లెగా పేరొందిన అంకాపూర్ గ్రామం పక్కనే ఉన్నది. అధునాతన వ్యవసాయం, కూరగాయల సాగు, విత్తనోత్పత్తిలో అగ్రగామిగా నిలిచింది. సీడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా పేరున్నది. పసుపు, ఎర్రజొన్న, మొక్కజొన్న సాగులో ముందు వరుసలో ఉన్నది. పూర్వం నవనాథ సిద్ధులు దేశమంతా సంచరిస్తూ ఆర్మూర్‌కు చేరుకున్నారనీ, ఇక్కడి కొండల్లో తపస్సు చేస్తున్న క్రమంలో 9 మంది నవనాథ సిద్ధుల్లోంచి ముగ్గురు ఇక్కడే ఉండి ఆరుగురు వెళ్లిపోయారని ఆరు, మూడు రాను రాను ఆరుమూరు ఆర్మూర్‌గా ప్రసిద్ధి చెందింది.

- గోదావరి నదిపై రూ.120 కోట్లతో వంతెన
- 10 కోట్లకుపైగా వ్యయంతో మండపాల నిర్మాణం
- అన్ని రంగాల్లో ఆదర్శం ఆర్మూరు నియోజకవర్గం

1952లో ఆవిర్భవించిన ఆర్మూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఒక ప్రత్యేకత ఉన్నది. ఇక్కడ గెలుపొందిన వారు రాజకీయంగా ఎదుగుతారని ప్రతీతి. ఉద్యమ సమయంలో అంటే 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనే ఇక్కడ బీఆర్‌ఎస్ విజయం సాధించింది. ఉద్యమ నాయకుడిగా ఎదిగిన ఆశన్నగారి జీవన్‌రెడ్డి.. 2014, 2018 ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందారు.





గోదావరి నదిపై నిర్మించిన వంతెన

### కోట్ల రూపాయలతో అభివృద్ధి...

తొమ్మిదేండ్లలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి రోడ్లు, వంతెనలు, దవాఖానలు, విద్యాలయాలు, కొత్త మండలాలు, ఎత్తిపోతల పథకాలు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు నిర్మించారు. నిజామాబాద్, నిర్మల్ జిల్లాలను కలుపుతూ నందిపేట్ మండలం ఉమ్మెడ పాత గ్రామం వద్ద రూ.120 కోట్లతో గోదావరి నదిపై వంతెన నిర్మించారు. 50 సంవత్సరాల క్రితం దూరమైన రెండు ప్రాంతాలు ఎస్సారెస్పీ నిర్మాణంతో వంతెన నిర్మాణంతో దగ్గరయ్యాయి. వెల్మల్, జోర్‌పూర్, దేగాం వాగులపై నూతన వంతెనలు నిర్మించారు. రూ. 250 కోట్లతో బీటీ, సీసీ రోడ్లను నిర్మించారు.

### రెవెన్యూ డివిజన్ కల సాకారం...

ఆర్మూర్‌తో పాటు బాల్కొండ నియోజకవర్గాల ప్రజల దశాబ్దాల కల ఆర్మూర్ రెవెన్యూ డివిజన్‌ను సాకారం చేశారు. డొంకేశ్వర్, ఆలూర్ మండలాల ఏర్పాటుతో పరిపాలనా సౌలభ్యంగా మారింది. రూ.10 కోట్ల వ్యయంతో మండపాల నిర్మాణం చేపట్టారు.

### రూ. 50 కోట్లతో అర్బన్ పార్క్

ఆర్మూర్, నిజామాబాద్ ప్రధాన రోడ్డును ఆనుకొని మాక్లూర్ మండలం పరిధిలోని చిన్నాపూర్ సమీపంలో రూ. 50 కోట్ల వ్యయంతో అర్బన్ పార్కును తీర్చిదిద్దారు. సుమారు 400 ఎకరాల సువిశాలమైన అడవిని పార్కుగా మార్చారు. ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానను 30 పడకల స్థాయి నుంచి 100 పడకల స్థాయికి పెంచారు. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధతో డయాలసిస్ సెంటర్‌ను మంజూరు చేయించారు.

- ఆర్మూర్, నమస్తే తెలంగాణ

## షహర్ కీ బాత్

### ఆత్మగౌరవాన్ని పెంచిన కేసీఆర్

చిన్నప్పటి నుంచి అనేక క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నాము. ఇతర రాష్ట్రాల్లో కూడా వేడుకలు చూశాను. తెలంగాణ వచ్చినంక, కేసీఆర్ గారు సీఎం అయ్యాక పేద చర్చిల్లో క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకుంటున్నాం. తెలంగాణలో క్రిస్మస్ వేడుకలు జరిగినంత ఘనంగా మరెక్కడా జరగలేదు. భోజనాలు పెట్టాలని, దుస్తులు కావాలని ప్రభుత్వాన్ని మేమెన్నడూ కోరలేదు. కేసీఆరే అడగకుండా ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం క్రిస్మస్ కానుకలు ఇవ్వాలనుకునే నిర్ణయం మాకు సంతోషం కలిగించింది. క్రైస్తవ మైనారిటీలను ఏ ప్రభుత్వం గుర్తించలేదు. కేసీఆర్ నిర్ణయం మా ఆత్మగౌరవాన్ని పెంచింది. క్రిస్మస్ వస్తుందంటే పేద క్రైస్తవులు అందరూ చాలా సంతోషంగా ఉంటారు. వాళ్ల సంతోషాన్ని కేసీఆర్ కానుకలు రెట్టింపు చేశాయి. కేసీఆర్ ప్రతి క్రిస్మస్‌కు అందరికీ దుస్తులు ఇచ్చారు.



తెలంగాణ ప్రభుత్వం క్రిస్మస్ వేడుకల నిర్వహణ కోసం లక్ష రూపాయల నిధులిచ్చింది. మా చర్చిలో మూడు వందల మంది పేద క్రైస్తవులతో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకొంటున్నాం. ఇంతకుముందు క్రిస్మస్ నిర్వహణ కష్టంగా ఉండేది. ఆ లక్ష రూపాయల సహాయంతో క్రైస్తవులకు బిర్యానీతో విందు ఏర్పాటు చేశాం. క్రిస్మస్ కానుకగా కేసీఆర్ అందించిన దుస్తులు పంచేటప్పుడు పేదలు ఎంతో సంతోషంగా స్వీకరించారు. ఒక పేదరాలు వచ్చి అయ్యా.. నా కొడుకు కూడా పండుగ కోసం నాకు కొత్త బట్టలు కొనివ్వలేదని, కొడుకులాగే కేసీఆర్ కొత్త చీర ఇచ్చిండని సంతోషంగా చెప్పింది. ఇటువంటి క్రిస్మస్‌ని ముందెన్నడూ జరుపుకోలేదు. ఇటువంటి కార్యక్రమాలను ఇకముందూ కొనసాగించాలి. కేసీఆర్ పెద్ద కుమారుడిలా మంచి కార్యక్రమానికి పూనుకున్నారు. కేసీఆర్‌కు వందనాలు. కేసీఆర్‌ను ఆయన ప్రభుత్వాన్ని దేవుడు చల్లగా దీవించుగాక.

– వెలమర్తి కిరణ్, పాస్టర్, ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరం, పాటిగడ్డ కాలనీ, బేగంపేట, హైదరాబాద్

బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన వినూత్న వేదిక వీ హబ్ వ్యవసాయ పనులు చేసుకునే గ్రామీణ మహిళలను ఆంత్రప్రెన్యూర్లుగా మార్చింది. కార్పొరేట్ బ్రాండ్‌లకు దీటుగా 'ఆసరా' పేరిట వారు తయారు చేస్తున్న ఉత్పత్తులు ఇప్పుడు నల్లగొండ ఉమ్మడి జిల్లాతోపాటు ఐదు రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఏటా రూ.50 లక్షల లావాదేవీలను నిర్వహిస్తూ ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు

# మహిళలకు ఆసరా

- ఆంత్రప్రెన్యూర్లుగా మారిన మహిళా వ్యవసాయ కూలీలు
- వ్యాపార రంగంలో రాణిస్తున్న లక్ష్మి పద్మావతి మహిళా సంఘం

వారంతా కూలీనాలీ చేసుకునే వ్యవసాయ కూలీలు. కానీ వారిలో సొంతంగా ఏదైనా వ్యాపారం ప్రారంభించాలనే పట్టుదల ఓ మహిళా సంఘంలోని మహిళలను ఏకం చేసింది. వ్యవసాయ పనులు చేసుకుంటూ వచ్చిన డబ్బులను కూడబెట్టుకునే అలవాటే వారిని సరికొత్త మార్గంలో నడిచేలా చేసింది. తమ కలలను సాకారం చేసుకునేలా ఏర్పాటు చేసుకున్న లక్ష్మి పద్మావతి మహిళా సంఘాన్ని వ్యాపార కేంద్రంగా మలిచి, వంట గదికి అవసరమైన ఆహార ఉత్పత్తులను తయారు చేయడం మొదలు పెట్టారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు నెలకొల్పిన వీ హబ్ ఆ సంఘం సభ్యులకు వ్యాపార మెలకువలు నేర్పించి అండగా నిలిచింది. మార్కెటింగ్, ఉత్పత్తుల ప్యాకేజీపై అవగాహన కల్పించి కార్పొరేట్ బ్రాండ్ తరహాలో విక్రయాలు చేసుకునేలా సాయం చేసింది. ప్రస్తుతం వీరి వ్యాపారం చుట్టుపక్కల జిల్లాలతోపాటు ఐదు రాష్ట్రాలకు ఎగుమతి చేసుకునే స్థాయికి చేరింది. ఇంటికి అవసరమైన కారం, పసుపు, మసాలా పొడులను ఉత్పత్తి చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మేళ్లచెరువు,



ఉత్పత్తులను ప్యాకింగ్ చేస్తున్న మహిళలు

ఎర్రగట్టు తండా, గుడిమల్కాపురం, దొండపాడు, చింతలపాలెం గ్రామాలకు చెందిన మహిళలు ఇప్పుడు వ్యాపారాన్ని విస్తరిస్తూ ఏటా రూ.50 లక్షల లావాదేవీలు నిర్వహిస్తున్నారు. వీటిని 'ఆసరా' బ్రాండ్ పేరుతో విక్రయిస్తున్నారు. ప్రతి నెలా 10 టన్నుల మేర ఆహార ఉత్పత్తులను ప్రాసెస్ చేస్తున్నట్లు ఆ సంఘానికి ప్రాతినిధ్యం వహిస్తున్న లక్ష్మమ్మ వివరించారు. మార్కెట్లో ఉండే కల్తీ, నాసిరకం ఉత్పత్తుల కంటే తమ ఉత్పత్తులు నాణ్యతతో ఉంటాయని తెలిపారు. అన్ని ఖర్చులు పోనూ ప్రతి నెలా రూ.3 నుంచి 4 లక్షల మేర సంపాదించుకునే స్థాయిలో నిలిచారు.

... కడార్ల కిరణ్